కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం తప్పదు

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 2: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను హరిస్తే రానున్న కాలంలో పతనం కాకతప్పదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్ హెచ్చరించారు. హెచ్ సీయూ వద్ద భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్యయుతంగా జరిగిన ధర్నాలో పాల్గొన్న నాయకులపై లాఠీచార్జీని ఖండిస్తూ బుధవారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లిలో పార్టీ మండల కార్యకర్తలతో కలిసి ప్లకార్డ్స్ ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ, నిర్బంధంతో ప్రజా ఉద్యమాలను అణచివేయాలని చూస్తే, కాంగ్రెస్ పార్టీ కాలగర్భంలో కలవడం ఖాయమని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రజా సంఘంగా ఆందోళనలు చేస్తున్న వారి హక్కులను కాపాడాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శాతరాజు భద్రయ్య, నాయకులు గట్టు సతీశ్, పిట్టల సంపత్,

సదాశివపల్లిలో ప్లకార్డ్ స్ తో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

రాములు తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్, ఏప్రిల్2: హెచ్సీయూ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ పట్టణంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల శంకర్, నాయకులు కొంకట చంద్రయ్య, చేరాలు, ప్రశాంత్, రమేశ్, రవి, ప్రభుశంకర్ తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్ పాదయాత్రను బహిష్కరించాలి'

చిగురుమామిడి, ఏప్రిల్ 2: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా సమాజానికి హక్కులు రాకుండా అడ్డుపడ్డ గాంధీని ఏవిధంగా జై బాపు అని పిలువాలని ధర్మ సమాజ పార్టీ (డీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేశ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 'జై బాపు, జై భీమ్, జై రాజ్యాంగం' నినాదాలతో చేపట్టిన పాదయాత్రను ప్రజలు బహిష్కరించాలని ఒక ప్రకటనలో కోరారు. గాంధీ సిద్ధాంతం అంటే పూర్తిగా అగ్రకులాలకు సంబంధించినదని ఆరోపించారు. అంబేద్కర్ పోరాటానికి అడుగడుగున అడ్డుపడ్డ కాంగ్రెస్ పార్టీ జై భీమ్ అనే నినాదాన్ని పలికే అర్హత కోల్పోయిందని పేర్కొన్నారు.

కల్లాల వద్దే తూకం

పోతుగంటిపల్లి వద్ద ధాన్యం తూకం వేస్తున్న ప్రైవేటు కూలీలు

గంగాధర, ఏప్రిల్ 2: మండలంలో ఇప్పటికే వరి కోతలు ప్రారంభమైనా ప్రభుత్వం ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. దీనికి తోడు అకాల వర్షాలు కురిసే ఆస్కారం ఉన్నందున ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.1880 చొప్పున చెల్లించి కల్లాల వద్దే తూకం వేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. వెంకంపల్లి జీపీ పరిధిలోని పోతుగంటిపల్లి వద్ద బుధవారం ప్రైవేటు వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు దాదాపు వెయ్యి క్వింటాళ్ల వరకు ధాన్యాన్ని దళారులకు అముకున్నట్లు రైతులు తెలిపారు.

'కాంగ్రెస్ సభ్యుల నియామకాన్ని నిలిపివేసిన హైకోర్టు'

కొత్తపల్లి, ఏప్రిల్ 2: నిబంధనలకు విరుద్ధంగా వినియోగదారుల సహకార సంఘానికి పర్సన్ ఇన్చార్జి కమిటీగా 9 మంది కాంగ్రెస్ సభ్యులను నియమిస్తూ డీసీవో ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు నిలిపివేసిందని మాజీ అధ్యక్షుడు ఎండీ ఫక్రూద్దీన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల సహకార సంఘానికి ఎన్నికైన మేనేజింగ్ కమిటీ పదవీకాలం 2025 జనవరి 7న ముగిసిందని, చట్టప్రకారం ఎన్నికైన కమిటీకి ఆరు నెలల గడువు పొడిగింపు లేదా అధికారిని పర్సన్ ఇన్చార్జిగా నియమించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా జిల్లా సహకార అధికారి రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తొమ్మిది మంది కాంగ్రెస్ పార్టీ నాయకులను పర్సన్ ఇన్చార్జీ కమిటీగా నామినేట్ చేయడంతో దీనిపై తాను హైకోర్టులో రిట్ పిటిషన్ నం.డబ్ల్యూపీ 9959 /2025ను దాఖలు చేసినట్లు తెలిపారు. చట్టవిరుద్ధంగా పర్సన్ ఇన్చార్జి కమిటీని నియమిస్తూ డీసీవో ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు నిలిపివేసిందని, అధికారిని పర్సన్ ఇన్చార్జిగా నియమించాలని జిల్లా సహకార అధికారిని ఆదేశించినట్లు ఫక్రూద్దీన్ పేర్కొన్నారు.

మానవత్వం చాటుకున్న బీఎన్రావు ఫౌండేషన్



చెక్కు అందిస్తున్న డాక్టర్ బీఎన్ రావు

విద్యానగర్, ఏప్రిల్ 2 : ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన ఓ వ్యక్తికి డాక్టర్ బీఎన్ రావు ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటింది. మార్చి 2న చట్ల సమ్మయ్య అనే వ్యక్తి ప్రమాదానికి గురయ్యాడు. నెల రోజులుగా కోమాలో ఉన్నాడు, హైదరాబాద్లో తలకు ఆపరేషన్ అనంతరం అతడిని కుటుంబ సభ్యులు కరీంనగర్లోని ప్రముఖ దవాఖానకు తరలించారు, అక్కడ ఆరోగ్యం కుదుట పడకపోవడంతో నగరంలోని ఒక రిహాబిటేషన్ సెంటర్లో చేర్పించారు. నెల రోజులుగా వైద్యానికి సుమారు రూ.పది లక్షల వరకు ఖర్చు కావడంతో విషయం తెలుసుకున్న డాక్టర్ బి.ఎన్ రావు వెంటనే స్పందించారు. తమ ఫౌండేషన్ ద్వారా రూ.20 వేల విలువైన చెక్కు అందించి సమ్మయ్య కుటుంబానికి అండగా నిలిచారు. అంతేకాకుండా హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి పేషెంట్కి తగిన వైద్యం అందించాలని కోరారు.

సర్వాయి పాపన్నకు ఘన నివాళి

పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, ఏప్రిల్ 2 : భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్నకు జిల్లా అధికారులు, గౌడ సంఘం ప్రతినిధులు ఘన నివాళులర్పించారు. బుధవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొని, పాపన్న చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాపన్న చేసిన పోరాటం నేటి, భవిష్యత్ తరాలకు ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, బీసీ సంక్షేమశాఖ అధికారి అనిల్ ప్రకాశ్, గౌడ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సైదాపూర్, ఏప్రిల్ 2: సర్వాయిపేట శివారులోని కొమ్ముగుట్ట వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చొప్పదండి, ఏప్రిల్ 2: పట్టణంలోని తెలంగాణ చౌరస్తా వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం పట్టణాధ్యక్షుడు పెరుమండ్ల గంగయ్య గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

నిలిచిన ధ్రువీకరణ పత్రాల జారీ

- మున్సిపాలిటీల్లో పది రోజులుగా పని చేయని సర్వర్
- బర్త్, డెత్ సర్టిఫికేట్ల కోసం ప్రజల ఇబ్బందులు
- నగరంలో వెయ్యికి పైగా దరఖాస్తులు పెండింగ్

కార్పొరేషన్, ఏప్రిల్ 2: ఏదైనా సాంకేతిక సేవల్లో సమస్య వస్తే వెంటనే స్పందించి చక్కదిద్దాల్సిన ప్రభుత్వం రోజుల తరబడిగా మిన్నకుండిపోవడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నది. మున్సిపాలిటీల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే విభాగంలో సర్వర్ పూర్తిగా నిలిచిపోవడంతో ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు తమ సర్టిఫికేట్ల కోసం ఇటు కార్యాలయం, అటు మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది.

పది రోజులుగా నిలిచిన సర్వర్

అన్ని మున్సిపాలిటీల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను ఆన్లైన్లోనే నమోదు, జారీ చేస్తుంటారు. ప్రజలు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే, వాటిని ఆయా మున్సిపాలిటీల అధికారులు పరిశీలిస్తారు. ఆయా హాస్పిటళ్ల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా దరఖాస్తు దారుకు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తూ ఉంటారు. అయితే దీనికి సంబంధించిన సర్వర్ పది రోజులుగా పని చేయడం లేదు. దీంతో ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. కరీంనగర్ నగరపాలక సంస్థలో ఆన్లైన్ సాంకేతిక సమస్య తలెత్తడానికి ముందే 150 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, ఇక పది రోజుల్లో అర్జీల సంఖ్య సుమారు వెయ్యి దాటి ఉండొచ్చని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. నగరవాసులకు ఎంతో ముఖ్యంగా ఈ సేవలను పునరుద్ధరించడంలో రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ శాఖ అధికారులు తీవ్రజాప్యం చేస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సర్వర్ పని చేయకపోవడం వల్ల తాము ఎలాంటి దరఖాస్తులు పరిష్కరించలేకపోతున్నామని నగరపాలక సంస్థ ఏఎస్వో మల్లేశ్వరి తెలిపారు. ఈ సమస్యను తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినట్లు అధికారులు చెబుతుండగా, రాష్ట్ర మున్సిపల్ శాఖ సర్వర్ను వినియోగంలోకి తెచ్చేదెప్పుడో, తమకు సర్టిఫికేట్స్ జారీ అయ్యేదెప్పుడోనని దరఖాస్తుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

భక్తులకు అన్ని వసతులు కల్పించాలి

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్రెడ్డి
- బ్రహ్మోత్సవాలపై అధికారులతో సమీక్షా సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

ఇల్లందకుంట, ఏప్రిల్ 2: ఈ నెల 6న జరిగే శ్రీసీతారాముల కల్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్ కార్యాలయంలో కలెక్టర్ పమేలా సత్పతి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి ఇల్లందకుంట సీతారాముల బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసి పని చేయాలన్నారు. ఆలయ ఆవరణలో పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా చూడాలని సీపీని కోరారు. బ్రహ్మోత్సవాలకు రూ.10 లక్షల నిధులు విడుదల చేయాలని కలెక్టర్ను కోరారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీకిరణ్, ప్రపుల్ దేశాయ్, దేవాలయ ఈవో సుధాకర్, ఏసీపీ శ్రీనివాస్ జీ, డీపీవో జగదీశ్వర్, ఆర్డీవో రమేశ్బాబు, ఎంపీడీవో పుల్లయ్య, డీఎల్పీవో శ్రీనివాస్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అట్టహాసంగా 'ప్రథమోత్సవ్'

కార్యక్రమం ప్రారంభించి, విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

కమాన్చౌరస్తా, ఏప్రిల్ 2 : జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ గర్ల్స్ ఇ-టెక్నో స్కూల్ పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రథమోత్సవ్ పేరుతో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న విషయాలపై ఎప్పటికప్పుడు సమగ్రంగా సాధన చేస్తూ విశ్లేషిస్తూ వాటిపై పట్టు సాధించి సమాజంలో అత్యుత్తమంగా స్థిరపడాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విశేషంగా కృషిచేసి వారికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'శ్రీ సరస్వతీ' విద్యార్థుల ప్రతిభ

శ్రీ సరస్వతీ హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్

రామడుగు, ఏప్రిల్ 2: మండలంలోని వెలిచాల శ్రీ సరస్వతీ హైస్కూల్ విద్యార్థులు జిల్లా కేంద్రంలో చేంజ్ లర్నింగ్ అకాడమీ ఆధ్వర్యంలో మార్చి 31న జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో చక్కని ప్రతిభ చూపి సత్తాచాటినట్టు పాఠశాల కరస్పాండెంట్ ఉప్పల శ్రీనివాస్ తెలిపారు. రూబిక్ క్యూబ్ సీనియర్స్ విభాగంలో రాము, జూనియర్స్ విభాగంలో సుశాంత్, చెస్ కాంపిటీషన్ సీనియర్స్ విభాగంలో విష్ణుప్రియ, జూనియర్స్ విభాగంలో గురుదీప్, పాటల పోటీల్లో అక్షయ, పియానో పోటీల్లో సీనియర్స్లో వశిష్ట్, జూనియర్స్లో గురుదీప్, కంప్యూటర్ అసెంబుల్లో అక్షిత్ మొదటి బహుమతులు సాధించారని వివరించారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులను కరస్పాండెంట్ శ్రీనివాస్తో పాటు కో కరస్పాండెంట్ సత్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

చెట్ల నరికివేతపై తహసీల్దార్కు ఫిర్యాదు

గంగాధర, ఏప్రిల్ 2: నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నాగిరెడ్డిపూర్ మీదుగా వెళ్తున్న డీ4 కెనాల్పై ఉన్న చెట్లను అనుమతులు లేకుండా నరికివేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బుధవారం మండల తహసీల్దార్కు ఫిర్యాదు చేసినట్లు నాగిరెడ్డిపూర్ మాజీ సర్పంచ్ ఆకుల అంజయ్య తెలిపారు. వాల్టా చట్టాన్ని ధిక్కరించి కెనాల్పై ఉన్న తుమ్మ, వేప చెట్లను ఇరిగేషన్ శాఖ అధికారులు నరికివేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

దాతల సహకారంతో సీసీ పనులు

గంగాధర, ఏప్రిల్ 2: రానున్న శ్రీరామ నవమి సందర్భంగా గట్టుభూత్కూర్ గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయానికి సీసీ వేయాలని గ్రామస్తుల కోరిక మేరకు దాతలు ముందుకు వచ్చారు. రూ.70 వేలతో ఆలయ ఆవరణలో బుధవారం సీసీ పనులు పూర్తి చేయించారు. దాతలు కంకణాల సత్యనారాయణరెడ్డి, బొమ్మాడి గోపాల్రెడ్డిని తాజా మాజీ సర్పంచ్ కంకణాల విజేందర్రెడ్డి, గ్రామస్తులు అభినందించారు.

మండల ప్రత్యేకాధికారిగా సల్మాన్రాజు

వీణవంక, ఏప్రిల్ 2: మండల ప్రజాపరిషత్ వీణవంక ప్రత్యేకాధికారిగా సల్మాన్రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీధర్ , సిబ్బంది మండల ప్రత్యేకాధికారికి స్వాగతం పలికారు.

అల్ఫోర్స్ మహిళా కళాశాలలో సిగ్నేచర్ డే వేడుకలు

వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులతో రవీందర్ రెడ్డి

కమాన్చౌరస్తా, ఏప్రిల్ 2 : జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో సిగ్నేచర్ డే వేడుకలు ఉత్సాహంగా సాగాయి. కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులు ఈ వేడుకలు నిర్వహించగా, కళాశాల కరస్పాండెంట్ వీ రవీందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తన సంతకం ఇతరులకు ఆటోగ్రాఫ్గా మారేలా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థినులు వారి దుస్తులపై పరస్పరం సంతకాలు చేసుకుని, ఆహ్లాదంగా గడిపారు.

అన్నిదానాల కన్నా.. విద్యాదానం గొప్పది

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 2: అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పదని, విద్యాదానం వల్ల ఒక కుటుంబం నిలబడుతుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మొగ్దుంపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో వర్క్సైట్స్ స్కూల్స్ను విలీనం చేయగా, ఇటుక బట్టీ యజమానులు సహకారంతో విద్యార్థులకు యూనిఫాం, ఇతర సామగ్రి అందజేశారు. వలస కార్మికులు తమ పిల్లలను పాఠశాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

కమాన్చౌరస్తా, ఏప్రిల్ 2 : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఈ క్రమంలో చివరి రోజు జరిగిన సాంఘిక శాస్త్రం పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 12,521 మందికి 12,504 మంది హాజరుకాగా, 17 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 9 మందికి ఐదుగురు హాజరుకాగా, నలుగురు పరీక్ష రాయలేదు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక తనిఖీ బృందాలు 20 పరీక్ష కేంద్రాలు, ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ ఐదు పరీక్ష కేంద్రాలు, జిల్లా విద్యా శాఖాధికారి ఐదు పరీక్ష కేంద్రాలు, మొత్తం 30 కేంద్రాలను తనిఖీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్టీసీ ఈడీ బాధ్యతల స్వీకరణ

తెలంగాణచౌక్, ఏప్రిల్ 2: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల ఈడీ కార్యాలయంలో నూతన ఈడీ సోలోమన్, బదిలీపై హైదరాబాద్ వెళ్తున్న ఈడీ ఖుస్రోషాఖాన్ నుంచి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన ఈడీని ఆర్ఎం రాజు, డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి, వెంకటేశ్వరరావు, వర్క్షాపు మేనేజర్ సుగుణాకర్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ స్వప్న కుమారి, డీఎంలు విజయమాధురి, శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

మండల సమాఖ్య నూతన పాలకవర్గం

చిగురుమామిడి, ఏప్రిల్ 2: మండల కేంద్రంలో బుధవారం ఉదయ లక్ష్మి మండల సమాఖ్య నూతన పాలకవర్గం ఎన్నిక జరిగింది. మండలంలోని 36 గ్రామైక్య సంఘాల నుంచి 12 మందిని పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సుందరగిరి గ్రామానికి చెందిన గందే రజిత, ప్రధాన కార్యదర్శిగా కోనేటి స్వప్న, కోశాధికారిగా గొల్ల పల్లి అరుణ ఎన్నికయ్యారని టీ సెర్ప్ (ఐకేపీ డీఆర్డీఏ) ఏపీఎం మట్టెల సంపత్ తెలిపారు. కార్యక్రమంలో గత పాలకవర్గ సభ్యురాలు గందే జ్యోతి, సీసీలు సత్యనారాయణ, సంపత్, వెంకటేశ్వర్లు, వెంకటమల్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఏప్రిల్ 2: నగరంలో డీటీఆర్ పనులతో పాటు కరీంనగర్ రూరల్ మండలం వల్లంపహాడ్ ఫీడర్లో స్తంభాల ఏర్పాటు, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2, కరీంనగర్ రూరల్ ఏడీఈలు లావణ్య, రఘు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2నుంచి 3గంటల వరకు విద్యానగర్, బీరప్ప కమాన్, కొత్త యాస్వాడ, ఇండస్ట్రియల్ ఏరియా, వెంకటేశ్వర కమాన్ ప్రాంతం, ఉదయం 9నుంచి 11గంటల వరకు వల్లంపహాడ్కు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అనాథాశ్రమానికి విద్యుత్ ఉద్యోగుల విరాళం

ముకరంపుర, ఏప్రిల్ 2: కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీలో వీబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధులు, అనాథాశ్రమానికి విద్యుత్ ఉద్యోగులు బుధవారం రూ.20వేలు విరాళంగా అందజేశారు. ప్రతి నెలా ఉద్యోగులు తలా కొంత మొత్తాన్ని సేకరించి విరాళం రూపంలో వీబీ ఫౌండేషన్ ఖాతాకు జమ చేస్తున్నారని ఎస్ఈ ఎం రమేశ్ బాబు తెలిపారు. విధి నిర్వహణతో పాటు తమ వంతుగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఉద్యోగులను ఎస్ఈ అభినందించారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

స్కానింగ్ సెంటర్ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్వో, సీఐ

విద్యానగర్, ఏప్రిల్ 2 : కరీంనగర్లోని స్కానింగ్ సెంటర్లను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వెంకటరమణ, టూటౌన్ సీఐ సృజన్రెడ్డి తనిఖీ చేశారు. స్కానింగ్ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ధరల పట్టిక, రికార్డుల నిర్వహణ ఉండాలన్నారు. స్కానింగ్ వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి పంపించాలన్నారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. తనిఖీల్లో వైద్యాధికారులు ననసజవేరియా, రాజగోపాల్, ఏఎస్ఐ విజయమణి, రమేశ్ సాబిర్, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం కలెక్టర్కు రైతుల వినతి

ఇల్లందకుంట, ఏప్రిల్ 2: మండలంలో కాల్వల కింద వివిధ రకాల పంటలు సాగు చేశామని, చేతికి వచ్చే సమయంలో పంటలు ఎండిపోకుండా సాగు నీటిని విడుదల చేయాలని మండలంలోని రైతులు కలెక్టర్ పమేలా సత్పతికి విన్నవించారు. స్పందించిన ఆమె, పంటలు ఎండిపోకుండా నీటి విడుదలకు కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

సన్నబియ్యం పంపిణీ ప్రారంభం

కమాన్చౌరస్తా, ఏప్రిల్ 2: పేద ప్రజలందరూ రాష్ట్ర ప్రభుత్వం అందించే సన్న బియ్యం సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలోని అల్గునూర్లో రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఇక్కడ స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రామడుగు/గంగాధర, ఏప్రిల్ 2 : గంగాధర మండలం వెదిర చౌకధరల దుకాణంలో బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. సన్నబియ్యం పంపిణీ నిరుపేదలకు ఒక వరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. అలాగే గంగాధర మండలం మంగపేట గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ ప్రారంభించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమాన్చౌరస్తా, ఏప్రిల్ 2 : ఇండియన్ ఆర్మీలో నియామకం కోసం ఔత్సాహిక అభ్యర్థులు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్, అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పన అధికారి తిరుపతి రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇండియన్ ఆర్మీలో వివిధ కేటగిరీల వారీగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ (క్లర్క్/స్టోర్ కీపర్/ టెక్నికల్), అగ్నివీర్ ట్రేడ్స్ మెన్ పోస్టులు ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు www.joinindianarmy. nic. ద్వారా ఈనెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం, సలహాలు సూచనల కోసం సికింద్రాబాద్లోని రిక్రూటింగ్ కార్యాలయం ఫోన్ నంబరు 040-27740205లో సంప్రదించవచ్చని ఓ ప్రకటనలో సూచించారు.

బస్టాండ్లో చలివేంద్రం ప్రారంభం

శంకరపట్నం, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్లో బుధవారం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, నాయకులు గజెల్లి హన్మంతు, బండారి తిరుపతి, సదానందం, హిసామొద్దీన్, ప్రయాణికులు ఉన్నారు.

నిరుపేద మహిళలకు చేయూత



మహిళకు కుట్టు మిషన్ అందిస్తున్న హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి చింతల శ్రీనివాస్రెడ్డి

కొత్తపల్లి, ఏప్రిల్ 2 : కొత్తపల్లి పట్టణానికి చెందిన ఐదుగురు నిరుపేద మహిళల జీవనోపాధి కోసం హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేసి చేయూతనందించింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి చింతల శ్రీనివాస్రెడ్డి మాట్లాడుతూ, మహిళా సాధికారతే లక్ష్యంగా ఫౌండేషన్ కార్యక్రమాలు కొనసాగిస్తున్నదని, దీనిలో భాగంగా ఎంతోమంది మహిళల ఉపాధి కోసం కుట్టు మిషన్లతో పాటు ఇతర వస్తువులు సమకూర్చుతున్న